సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం। 26। ఫిబ్రవరి। 2024



అభివృద్ధికి కృషి చేస్తా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి తెలిపారు. -8లో



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ నియోజకవర్గాల్లో ఆయా నేతల సమక్షంలో పార్టీలో చేరారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.8/23.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 23.8 – 36.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వెండి ఆభరణాలు వితరణ



వృషభాచలేశ్వరస్వామికి వెండి ఆభరణాలను అందిస్తున్న భరత్‌కుమార్ దంపతులు

వేంపల్లె: పవిత్ర పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దులకొండపై వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలోని వృషభాచలేశ్వరునికి భక్తులు 850 గ్రాముల వెండి ఆభరణాలను వితరణ చేసినట్లు ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ కుర్రాకుల వెంకటేష్‌లు తెలిపారు. ఆదివారం ఉదయం అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెకు చెందిన సగళా నాగిశెట్టి.. కన్యాకుమారి దంపతుల కుమారుడు భరత్‌కుమార్, సతీమణి శ్రావణిలు స్వామివారికి వెండి సాలి గ్రామాల మాల, వెండి నామాన్ని అర్చకులు హరిప్రవీణ్‌కు అందించారు. దేవస్థానం ఆధ్వర్యంలో దాతలను సత్కరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కబడ్డీ సీనియర్ జట్టు ఎంపిక



జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని శివశివానీ హైస్కూల్ మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ సీనియర్ విభాగం ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ (రిజిష్టర్డ్ 115/2010) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలను సంఘం అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి టి. జనార్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కొవ్వూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగేంద్రరెడ్డి, కబడ్డీ సంఘం కోశాధికారి జయచంద్రబాబు, ప్రసాద్, మనోహర్, సురేంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టు: శివగణేష్‌రెడ్డి, దినేష్‌చౌదరి, చెన్నకృష్ణ, చెన్నకేశవరెడ్డి, వంశీ, వీరకుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్, నవీన్, గణేష్, ఖ్యాతివర్ధన్‌రెడ్డి, శివారెడ్డి, వెంకటశ్రీసుభాష్.

కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కడప స్పోర్ట్స్: కడపలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో వైఎస్‌ఆర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ (195/2023) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జిల్లాస్థాయి సీనియర్ విభాగం ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి విజేతలుగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.వి. సుబ్బయ్య, కోశాధికారి కొండయ్య, కోచ్ ఆర్.వి. శ్రీధర్‌లు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు వైజాగ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి. నిత్యప్రభాకర్, అరుణ, లీలావతి, కల్యాణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టు : కె.హరిప్రసాద్‌రెడ్డి, జి. సమరసింహారెడ్డి, చంద్రశేఖర్, కె.గిరీష్‌కుమార్, ఎ.వేణుసాయి, బి.వంశీ, దనుష్‌రెడ్డి, జి.చైతన్య, కె.ప్రేమ్‌చంద్‌రెడ్డి, ఎస్. రుషీంద్రసాయి, ఎం. రామాంజినేయులు, కె. విఘ్నేష్. స్టాండ్‌బై: గురుశివయ్య, బాషా, వంశీ, గురువర్ధన్.

చిరుత సంచారం



చిరుత దాడిలో గాయపడిన మేకతో భాగ్యమ్మ

సిద్దవటం: మండలంలోని జంగాపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో రాత్రివేళ చిరుత సంచారం చేస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చిరుత పులి తాగునీటి కోసం అటవీ ప్రాంతం నుంచి రాత్రి వేళల్లో గ్రామీణ ప్రాంతాల్లోకి వస్తోంది. శనివారం రాత్రి చిరుత జంగాలపల్లిలోని పాలెం భాగ్యమ్మ అనే మహిళ పూరి గుడిసెలో మేకలు గట్టిగా అరవడంతో ఆమె ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. మేకపై చిరుత దాడి చేస్తుండగా ఒక్కసారిగా ఆమె కేకలు వేయడంతో చిరుత మేకను వదిలేసి అడవిలోకి పారిపోయింది. చిరుత దాడిలో గాయపడిన మేకకు సిద్దవటం పశువైద్య శాలలో వైద్యం చేయించారు. ఈ విషయమై ఫారెస్టు రేంజర్ కళావతిని వివరణ కోరగా తాగునీటి కోసం చిరుత గ్రామంలోకి వచ్చిందని , గ్రామస్తులు జాగ్రతగా ఉండాలని చెప్పామన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- కర్నాటక సరిహద్దులో మృత్యుఘోష
- పాడిరైతులను ఢీకొన్న స్కార్పియో, ఇద్దరు మృతి
- తప్పించుకునే క్రమంలో వేగంగా లారీని ఢీకొన్న స్కార్పియో
- డ్రైవర్‌తో సహా ఇద్దరు మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన స్కార్పియో (ఇన్‌సెట్) విక్రమ్ ఫైల్‌ఫోటో



ప్రమాదంలో మృతిచెందిన రైతు చంద్రప్ప



రైతు సుబ్రహ్మణ్యం మృతదేహం

మదనపల్లె: అన్నమయ్యజిల్లా మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద ఆదివారం రాత్రి ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మద్యం మత్తులో స్కార్పియో వాహనాన్ని వేగంగా నడుపుతూ.. ఎదురుగా వస్తున్న రెండుకార్లు, రోడ్డుపై నిల్చున్న ఇద్దరు రైతులను ఢీకొని, అదుపుచేయలేని స్థితిలో లారీని ఢీకొని, ఐదుగురిని మృత్యువాతపడేలా చేసిన ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రమాదతీవ్రతకు స్కార్పియో వాహనం నుజ్జునుజ్జు కావడంతో పాటుగా డ్రైవర్ తల ఎగిరి మొండెం కిందపడింది. వాహనంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కడప–బెంగళూరు జాతీయరహదారిపై మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాద ఘటన షాక్‌కు గురిచేసింది. ప్రమాదం జరిగిన తీరు, మృతదేహాలు చిధ్రమైన వైనం, వాహనం నుజ్జునుజ్జు చూస్తుంటే.. మృత్యువు దూసుకొచ్చినట్లుగా కనిపిస్తోంది. ప్రమాదంలో మృతిచెందిన ఐదుగురు మదనపల్లెకు చెందినవారే కావడం బాధాకరం. ఘటనకు సంబంధించిన వివరాలు..

మదనపల్లె పట్టణం దేవతానగర్‌కు చెందిన చలపతి కుమారుడు సుంకరవిక్రమ్(38) అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ 8నెలల క్రితం తిరిగి వచ్చాడు. స్థానికంగా తిరిగేందుకు ఏపీ–39, ఎన్‌జే–8439 స్కార్పియో వాహనాన్ని కొనుగోలు చేశాడు. అమ్మచెరువుమిట్టకు చెందిన ఆటోడ్రైవర్ మల్లికార్జున కుమారుడు తిలక్(19) స్థానికంగా ఓ డిగ్రీ కళాశాలలో మొదటిసంవత్సరం చదువుతున్నాడు. తట్టివారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప కుమారుడు శ్రీనాథ్(25) ఆర్మీ ఉద్యోగాలకు శిక్షణ తీసుకుంటున్నాడు. రామారావుకాలనీకి చెందిన చరణ్‌కుమార్(25), హరీష్(33), మహేష్(31)లు స్నేహితులు. వీరు ఆరుగురు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలవరకు మదనపల్లెలోనే ఉన్నారు. తర్వాత మద్యం తాగుందుకు కర్ణాటకకు వెళ్లాలని నిర్ణయించుకుని విక్రమ్‌ను స్కార్పియో వాహనం తీసుకురమ్మని కోరారు. వాహనంలో ఆరుగురు కలిసి కర్ణాటకకు వెళ్లారు. అక్కడ సాయంత్రం వరకు మద్యంతాగి మదనపల్లెకు బయలుదేరారు. కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులో బారికేడ్లను ఢీకొన్నారు. అక్కడ పోలీసులు తమను పట్టుకుంటారేమోనన్న భయంతో వాహనాన్ని వేగంగా నడుపుతూ, ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. అలాగే వస్తూ..మరో కారు సైడ్ మిర్రర్‌ను ఢీకొని, వేగంగా ప్రయాణిస్తున్నారు. అదేసమయంలో చీకలబైలు పంచాయతీ కోళ్లవారిపల్లెకు చెందిన కరమల సుబ్రహ్మణ్యం ఆచారి అలియాస్ కాళిదాసు(55), యల్లుట్ల చంద్రప్ప(50) బార్లపల్లె పాలడిపోలో పాలుపోసి, రోడ్డుపై నిల్చున్నారు. వేగంగా వస్తున్న స్కార్పియో వాహనం రోడ్డుకు అటువైపు నిల్చున్న వీరిద్దరినీ ఢీకొంది. వాహనం ఢీకొన్న ధాటికి రైతులు ఇద్దరూ ఎగిరి కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. దీంతో స్థానికులు అరుపులు, కేకలు వేయడంతో ఆందోళన చెందిన విక్రమ్ స్కార్పియో వాహనాన్ని మరింత వేగం పెంచాడు. మితిమీరిన వేగంలో వాహనాన్ని అదుపుచేయలేక, వెనుక పరిగెత్తుకుని వస్తున్న వ్యక్తులను గమనిస్తూ, ఏమరుపాటులో ఎదురుగా వస్తున్న బోరుసామగ్రి తరలించే లారీని ఢీకొన్నాడు. దీంతో స్కార్పియో గాల్లోకి ఎగిరిలేచింది. టాప్ ఎగిరిపోయి కిందపడ్డ దెబ్బకు డ్రైవర్ విక్రమ్ తల తెగి మొండెం కిందపడింది. వాహనంలో ఉన్నటువంటి తిలక్, శ్రీనాథ్ అక్కడికక్కడే మృతిచెందారు. చరణ్‌కుమార్, హరీష్, మహేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో తాలూకా సీఐ ఎస్.శేఖర్, 108 సిబ్బందిని అప్రమత్తం చేసి క్షతగాత్రులను హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో చరణ్‌కుమార్, హరీష్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు రెఫర్ చేశారు. మహేష్ మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు.




మృతిచెందిన తిలక్ (ఫైల్) శ్రీనాథ్ (ఫైల్)

క్షణకాలంలో ఘోర ప్రమాదం

రాత్రి 7.40 గంటల సమయం. పల్లె ప్రశాంతంగా ఉన్న సమయంలో రోడ్డుపై దూసుకొచ్చిన ఓ వాహనం లారీని ఢీకొని గాల్లోకి ఎగిరి అందులోని వ్యక్తులు చెల్లాచెదురుగా కిందపడిన వైనం ఒక్కసారిగా భయాన్ని కల్పించిందని ప్రత్యక్షసాక్షి, బార్లపల్లె గ్రామస్తురాలు పద్మావతి తెలిపారు. స్కార్పియో వాహనం వేగంగా రావడం చూసిన తాను ఎక్కడ ఢీకొడుతుందోనని, ముందుగానే లారీని మార్జిన్‌లో నిలిపేశానని, అయితే దూసుకొచ్చి మరీ ఢీకొని గాల్లోకి లేచిందని తమిళనాడుకు చెందిన బోరు లారీ డ్రైవర్ దినేష్ చెప్పుకొచ్చాడు. కళ్లముందే ముగ్గురి ప్రాణాలు ఘోరంగా పోవడం తనను కలిచివేసిందని, షాక్ నుంచి తేరుకోలేకపోయానని భయపడుతూ చెప్పాడు. ప్రమాదంలో పేద కుటుంబాలకు చెందిన రైతులు చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

రిమ్స్‌లో క్రిటికల్ కేర్ సేవలకు నాంది..!



కడప రిమ్స్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) (రిమ్స్)లో రూ. 23.75 కోట్ల కేంద్ర నిధులతో ఏర్పాటు చేసిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) ఏర్పాటు కోసం దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదివారం వర్చువల్ విధానం ద్వారా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పీఎం – ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం– ఏబీ ఎంహెచ్ఐఎం) పథకం అమలులో భాగంగా భారత ప్రభుత్వం, దేశంలోని పలు జిల్లా స్థాయి ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. అందులో భాగంగానే కడప రిమ్స్ జీజీహెచ్‌లో కుడా రూ. 23.75 కోట్ల నిధులతో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) ఏర్పాటుకు రాజ్‌కోటి నుంచి కేంద్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి మన్సుఖ్ మాండీయతో కలిసి, ప్రధాని నరేంద్ర మోదీ శిలాఫలాకాన్ని వర్చువల్ విధానం ద్వారా ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 47,775 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు అంతస్తులతో క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని నిర్మించనున్నారు. అందుకుగాను రూ.16.63 కోట్లు భవన నిర్మాణ పనులకు , రూ.7.12 కోట్లు సంబంధిత వైద్య పరికరాల కొనుగోలుకు ఖర్చు చేయనున్నారు. రిమ్స్ సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎం.వి రామచంద్రారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ శారద, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ ఎం. సురేశ్వర్ రెడ్డి, ఏపీఎంఎస్ఐడిసి ఈఈ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, జిల్లా టీకాలు అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీలు



బాడీబిల్డర్స్‌తో ఉప ముఖ్యమంత్రి, మేయర్ తదితరులు

కడప స్పోర్ట్స్: కడప నగరం రవీంద్రనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన 1వ మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్, మెన్ ఫిజిక్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ది కడప బాడీబిల్డర్స్ అసోసియేషన్, బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా, కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. వీరితో పాటు సినీనటులు, కమెడియన్‌లు హాజరై నిర్వహించిన మిమిక్రీ షో, డాన్స్ హంగామా క్రీడాకారులను అలరించాయి. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ బాడీబిల్డింగ్ క్రీడకు జిల్లాకు ఎంతో చక్కటి అనుబంధం ఉందన్నారు. జిల్లాకు చెందిన పలువురు సీనియర్ క్రీడాకారులు 40 సంవత్సరాల క్రితమే రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో రాణించి టైటిల్స్ సాధించారన్నారు. రాష్ట్రంలోనే ప్రత్యేకత ఉండేలా జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు మాట్లాడుతూ బాడీబిల్డింగ్ క్రీడను సాధన చేయడం ద్వారా చక్కటి ఆకృతితో పాటు అవకాశాలు లభిస్తాయన్నారు. వైఎస్‌ఆర్ కడప జిల్లాను క్రీడల పరంగా అగ్రస్థానంలో ఉంచడమే లక్ష్యంగా స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నూనె నగేష్, ఎస్. యూనుస్‌బాషాలు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు చక్కటి ప్రదర్శన చేయాలని ఆకాంక్షించారు. సినీ నటులు రామ్‌జగన్, మురళి కమెడియన్‌లు శాంతకుమార్, జిగేల్ జీవన్, హరికృష్ణ, టీవీ నటుడు కార్తీక్‌ప్రసాద్‌లు మాట్లాడారు. అనంతరం వెయిట్ కేటగిరీల ప్రకారం క్రీడాకారులు పాల్గొని దేహదారుఢ్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో బాడీబిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఇ.వై.కుమార్, కార్పొరేటర్ ఎస్‌ఎండీ షఫీ, జైద్, ఇలియాస్, హరీష్, ఆదిత్య, రషీద్, రెఫరీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కడప రైల్వేస్టేషన్‌కు 'అమృత్' యోగం

- రూ.20.35 కోట్ల నిధులు విడుదల
- ప్రయాణికులకు ఒనగూరనున్న మరిన్ని సౌకర్యాలు
- నేడు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ



కడప రైల్వేస్టేషన్ పనుల నమూనా

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ల స్కీమ్‌లో భాగంగా దేశంలోని వివిధ రైల్వేస్టేషన్లను ఆధునీకీకరిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో మొత్తం 72 స్టేషన్లను ఎంపిక చేయగా, గుంతకల్లు డివిజన్‌లో మొత్తం 15 స్టేషన్లను అభివృద్ధి చేయనున్నారు. కడప రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు డిజైన్‌లు సిద్ధం చేసి పంపారు. ఈ పనులు పూర్తయితే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఇందుకోసం కడప రైల్వేస్టేషన్‌కు రూ. 20.35 కోట్లు నిధులు విడుదల చేయనున్నారు.

చేపట్టనున్న పనులు

అమృత్ స్టేషన్ల స్కీమ్‌లో భాగంగా కడప స్టేషన్లలో ముఖ భాగాన్ని పూర్తిగా పడగొట్టి పునర్నిర్మించడం, రెండు, మూడు ప్లాట్ ఫారాల విస్తరణ, నీటి అవసరం మేరకు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, ప్లాట్‌ఫాం మొత్తం గ్రానైట్‌తో తీర్చిదిద్దడం, 40 అడుగుల మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్రయాణికుల నిరీక్షణ గదులు, విశ్రాంత గదుల ఆధునికీకరణ, రాజంపేట మార్గంవైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ప్రస్తుతం మొదటి ప్లాట్‌ఫాంలో మాత్రమే ఉన్న లిఫ్ట్ సౌకర్యాన్ని మిగిలిన చోట్ల కూడా ఏర్పాటు చేయనున్నారు. అలాగే ప్రయాణికులకు సౌకర్యార్థం రైళ్ల రాకపోకల గురించి తెలియజేసే డిజిటల్ బోర్డులు ఏర్పాటు, మెరుగైన లైటింగ్ సౌకర్యం, రెండవ ప్లాట్‌ఫాం పూర్తిగా కవరింగ్, కొత్త లిఫ్ట్ ఏర్పాటు తదితర పనులు చేపడతారు. పనులన్నీ పూర్తయితే స్టేషన్లు అన్ని హంగులు సంతరించుకుని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు ఒనగూరనున్నాయి.

నేడు వర్చువల్ విధానంలో పనులు ప్రారంభించనున్న ప్రధాని

అమృత్ స్టేషన్ల స్కీమ్‌లో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి పనులను సోమవారం దేశ ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప రైల్వేస్టేషన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ కౌశల్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు హాజరు కానున్నారు.

రమేష్‌రెడ్డికి సీటు పోటు!

- రెడ్డెప్పగారి రాజకీయ వారసుడిగా ఆరంగ్రేటం
- ఎమ్మెల్యేగా ఎన్నిక, ఆపై టీడీపీ నేతగా విధేయత
- ప్రత్యామ్నాయంగా ఎదిగిన సోదరుడు శ్రీనివాసులరెడ్డి
- ధనంతుడు కావడంతో చేరదీసిన టీడీపీ అధిష్టానం
- యూజ్ అండ్ త్రో పాలసీ అమలు చేసిన చంద్రబాబు



రమేష్‌కుమార్‌రెడ్డి



శ్రీనివాసులరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ అధికారిక పగ్గాలు చేపట్టిన నాటి నుంచి అధినేత చంద్రబాబు యూజ్ అండ్ త్రో పాలసీ అమలు చేయడంలో దిట్టగా పేరు గడించారు. అవసరాలకు అనుగుణంగా నాయకులను వాడుకోవడంలో ఆయనకు మరెవ్వరు సాటిరారని విశ్లేషకులు సైతం అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అలాంటి పరిస్థితి తాజాగా మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డికి ఎదురైంది. రెడ్డెప్పగారి కుటుంబం రాజకీయ వారసుడిగా తెరపైకి వచ్చిన ఆయనకు అటు ఇంటి నుంచి ఇటు పార్టీ నుంచి సీటు పోటు తప్పలేదు. 25 ఏళ్లుగా పార్టీ విధేయునిగా ఉన్నా, అసెంబ్లీ సీటు దక్కకపోవడానికి సోదరుడి సారథ్యమే ప్రధాన కారణమని సమాచారం.

దివంగత మాజీ మంత్రి రెడ్డెప్పగారి రాజగోపాల్‌రెడ్డి రాజకీయ వారసుడిగా రమేష్‌కుమార్ రెడ్డి అరంగ్రేటం చేశారు. 1999లో లక్కిరెడ్డిపల్లె ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల్లో ఓటమి తర్వాత, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో లక్కిరెడ్డిపల్లె రద్దు అయింది. రాయచోటి నియోజవకర్గంలో లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మూడు మండలాలు కలిసిపోయాయి. 2009 ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి సాయి ప్రతాప్ చేతిలో ఓడిపోయారు. 2014, 19లలో రాయచోటి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. రమేష్‌రెడ్డి 1999 నుంచి ఇప్పటివరకు టీడీపీ నాయకుడుగా చెలామణీ అవుతున్నారు. కాంట్రాక్టర్‌గా స్థిరపడిన సోదరుడు శ్రీనివాసులరెడ్డి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2014లో తొలిసారి అరంగ్రేటం చేసిన వెంటనే కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా ఓడిపోయారు. క్రమంగా టీడీపీ సారథ్య బాధ్యతలకు దగ్గరయ్యారు. అధినేత చంద్రబాబు మనుసెరిగి మసులుకోవడంలో దిట్టగా మారడంతో టీడీపీలో పొలిట్‌బ్యూరో సభ్యుడుగా ఎదిగారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. దీనికి తోడు శ్రీనివాసులరెడ్డి ధనవంతుడు కావడంతో అధినేత చంద్రబాబు మరింత ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం.


కుటుంబానికి ఒక్కటే సీటు నిబంధన....

తెలుగుదేశం పార్టీలో ఇటీవల అనధికారికంగా కుటుంబానికి ఒక్కటే సీటు అనే నిబంధన పెట్టుకున్నారు. ఈక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్న శ్రీనివాసులరెడ్డి ఆ ఒక్క సీటు మా సోదరుడు రమేష్‌కుమార్‌రెడ్డికి ఇవ్వాలని అభ్యర్థించి ఉంటే తప్పకుండా వచ్చేదని పలువురు వివరిస్తున్నారు. అలా కాకుండా తన సతీమణి మాధవీరెడ్డికి కడపలో అవకాశం కల్పించాలని శ్రీనివాసులరెడ్డి కోరడంతోనే రమేష్‌రెడ్డి సీటు ప్రశ్నార్థమైనట్లు సమాచారం. 1999 నుంచి రాజకీయాల్లో కొనసాగుతూ బాధ్యతగా, విధేయుతతో పనిచేస్తున్న తనను కాదని, నిబంధనలు ముడిపెట్టి తనకు ఎగనామం పెడతారా? అన్న ఆక్రోశం రమేష్‌రెడ్డి వెళ్లగక్కుతున్నారు. ఆరు దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉన్న కుటుంబం నుంచి వచ్చిన తనకు ఇటు ఇంటిలోని వారు, అటు పార్టీకి చెందిన వారు వెన్నుపోటు పొడిచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమేరకు అనుచరగణం తీవ్రస్థాయిలో రగిలిపోతున్నట్లు సమాచారం.

అవకాశవాద రాజకీయాలతోనే..

నిబద్ధతతో రాజకీయాలు చేసేవారు కొందరైతే, అందివచ్చిన అవకాశాలతో ఎదిగే నేతలు మరికొందరు. చేయి అందించిన వారినే తొక్కుకుంటూ ఎదిగే నేతలు మరికొందరు. చంద్రబాబు తెరపైకి వచ్చినప్పటి నుంచి ఇలాంటి అవకాశవాదులు అధికమయ్యారు. తన..మన భేదం లేకుండా రాజకీయ ఉన్నతి కోసం సొంత మనుషులను, రక్త సంబంధీకులను తొక్కేయడంలో వీరు దిట్టలు. ఇలాంటి పరిస్థితితోనే రాయచోటి సీటు చేజార్చుకోవాల్సి వచ్చిందని రమేష్‌రెడ్డి సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తుదకు తనకు కాకపోయినా రాయచోటి సెగ్మెంట్‌లో మాధవీరెడ్డి అభ్యర్థిత్వం ఖరారు చేసినా ఇంతటి క్షోభ ఉండేది కాదని, సొంత నియోజకవర్గం రెడ్డెప్పగారి కుటుంబం నుంచి చేజార్చుకునే పరిస్థితి లేకుండా ఉండేదని పలువురితో వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా రాజకీయ భవిష్యత్ కోసం సన్నిహితులతో ప్రత్యేకంగా చర్చిస్తూ, రాయచోటి నుంచి పోటీ చేయాలనే దిశగా అడుగులు వేస్తూ, తదనుగుణంగా సమీకరణలు చేస్తున్నట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో షబ్-యే-బరాత్ ప్రార్థనలు



విద్యుత్ దీప కాంతుల్లో మసీదు

కడప కల్చరల్: పవిత్ర రంజాన్ మాసం రానుందని గుర్తు చేస్తూ మహిమాన్విత రాత్రిగా పేర్కొనే షబ్-యే-బరాత్ పర్వదినాన్ని ఆదివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లాతోపాటు కడప నగరంలోని దాదాపు అన్ని మసీదుల్లో రాత్రి ఇషా నమాజ్ తర్వాత గురువులు షబ్-యే-బరాత్ పవిత్రత, రానున్న రంజాన్ మాసం విశిష్టతలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ మహా ప్రవక్త మార్గాన్ని అనుసరించాల ని, రాబోయే రంజాన్ మాసంలో ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుని పుణ్యఫలాలను పొందాలని సూచించారు. పవిత్ర రాత్రి సందర్భంగా మసీదుల్లో తెల్లవారుజాము వరకు భక్తులు నమాజ్, జికర్, పవిత్ర ఖురాన్ పఠనంతో గడిపారు. మహిళలు తమతమ గృహాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

క్లుప్తంగా

లింగాల చెరువులో కొండ చిలువ కలకలం


లింగాల చెరువులో ఉన్న కొండ చిలువ

లింగాల : మండల కేంద్రమైన లింగాల చెరువులో ఆదివారం కొండ చిలువ కలకలం సృష్టించింది. దుస్తులు ఉతికేందుకు వెళ్లిన కొంతమందికి కొండ చిలువ కనిపించగా భయభ్రాంతులకు గురై గట్టిగా అరిచారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న యువకులు వీడియోలు తీశారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి కొండ చిలువను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశాంతంగా గ్రూప్–2 పరీక్షలు

- 85.34 శాతం అభ్యర్థుల హాజరు
- కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీపీఎస్సీ గ్రూప్–2 స్క్రీనింగ్ పరీక్షలు ఆదివారం జిల్లాలో ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్–2 ఉద్యోగాల నియామకాల కోసం నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌కు జిల్లాలో 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 23,807 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 20,316 మంది హాజరయ్యారు. అంటే 85.34 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభమై 1.30 గంటలకు ముగిసింది. అభ్యర్థులు సమయం కన్నా ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులందరినీ క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు 17 మంది జిల్లా స్థాయి అధికారులను రూట్ ఆఫీసర్లుగా, 67 మంది మండల స్థాయి అధికారులను లైజన్ ఆఫీసర్లుగా నియమించారు. కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ సిద్దార్థ కౌశల్, అడిషనల్ ఎస్పీ లోసారి సుధాకర్, కడప డీఎస్పీ షరీఫ్ తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును ఎస్పీ పరిశీలించారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా 400 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధులను నియమించినట్లు ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేశారు. అలాగే డీఆర్వో గంగాధర్‌గౌడ్ కూడా నగరంలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.ప్రమీల, సెక్షన్ ఆఫీసర్ విజయ నిర్మల తదితరులు పర్యవేక్షించారు.


పరీక్షా కేంద్రంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్

గ్రూప్–2 పరీక్షలో డీకే చదువులబాబు రచనపై ప్రశ్న

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత డీకే చదువుల బాబు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు పొందిన 'వజ్రాల వాన'కు సంబంధించి ఆదివారం జరిగిన గ్రూప్–2 పరీక్షలో ప్రశ్న అడగడం జరిగింది. 'డీకే చదువుల బాబు తన లఘు కథలు 'వజ్రాల వాన'కి తెలుగు భాషలో సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం 2023తో సత్కరించారు. డీకే చదువుల బాబుకు సంబంధించిన ప్రశ్న అడగడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తా: ఎంపీ మేడా


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

రాజంపేట రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక మేడా భవన్‌కు ఆదివారం విచ్చేసిన ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను రాజ్యసభ సభ్యునిగా ఎన్నిక చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. తనకు ఈ అవకాశం రావాడానికి తమ అన్న మేడా మల్లికార్జునరెడ్డి వేసిన పునాదులే కారణమన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో రానున్న ఐదేళ్లలో రాజంపేటను సర్వముఖాభివృద్ధి చేస్తానని తెలిపారు. రాజంపేటలో ఆకేపాటి అమరనాథరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి ముఖ్యమంత్రి రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు. నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పీసీ యోగీశ్వరరెడ్డి, గడికోట గుల్జార్‌బాషా, వడ్డే రమణ పాల్గొన్నారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సొంతిల్లు వచ్చింది



గతంలో నాకు పాడు పడ్డ కొట్టం ఉండేది. వర్షం వస్తే ఇంటిలో ఉండేదానికి చాలా ఇబ్బంది పడేదానిని. చిన్నపాటి రేకుల ఇంట్లో ఉండేవాళ్లం. గత ప్రభుత్వాలు మాలాంటి వారికి ఎలాంటి సహాయం అందివ్వలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక మా బతుకులు మారాయి. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇంటి స్థలం ఇచ్చినారు. పట్టా ఇచ్చారు. సొంత ఇల్లు కూడా కట్టుకున్నాం. చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు మా కుటుంబం ఏ చీకూ చింతా లేకుండా ముందుకు సాగుతోంది. మా కుటుంబాన్ని ఆదుకున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

- క్రిష్ణవేణి, రెడ్డివారిపల్లె గ్రామం, రైల్వేకోడూరు మండలం

సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుంది



రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతోంది. కంప్యూటర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా బోధన అందిస్తుంటే సంతోషంగా ఉంది. దీనివలన విద్యార్థులకు తెలివితేటలు పెరుగుతాయి. మా పాఠశాలలో గతంలో కొద్దిగా మాత్రమే సౌకర్యాలు ఉండేవి. కాని నాడు–నేడుతో మా పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. మధ్యాహ్న భోజనం మొదలుకుని, దుస్తులు, బూట్లు , విద్యాసామగ్రితో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆంగ్ల మాధ్యమం ఉండటంతో ప్రవేటు పాఠశాలల కంటే ప్రభుత్వపాఠశాలల్లోనే విద్యార్థులు అధికంగా చేరుతున్నారు.

- అడ్లూరు శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు, రైల్వేకోడూరు

కడపలో బలిజ భవన్ నిర్మాణానికి కృషి

డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో బలిజ భవన్ నిర్మాణానికి కృషి చేస్తామని డిప్యూటీ సీఎం అంజద్ బాషా, వైఎస్సార్‌సీపీ కడప, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల రీజినల్ కోఆర్డినేటర్, కడప మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. ఆదివారం కడప బలిజ ఐక్య వేదిక ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు దుర్గా ప్రసాద్, బీజేపీ నాయకుడు చలపతి, సీపీ నాయకుడు చంద్ర, జనసేన నాయకుడు రంజిత్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్ రాయల్, తోట కృష్ణలు డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో అధిక సంఖ్యలో ఉన్న బలిజ కులస్తులకు బలిజ భవన్ చాలా అవసరమని తెలిపారు. ఇది ఉండడం వల్ల తాము సామాజికంగా ఎదగడానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. దీనిపై డిప్యూటీ సీఎం, మేయర్ సానుకూలంగా స్పందిస్తూ రెండు రోజుల్లో స్థల పరిశీలన చేసి కలెక్టర్ ద్వారా సీసీఎల్‌ఏకు పంపిస్తామని, ఆ లెటర్ కాపీని సంఘ నాయకులకు కూడా అందజేస్తామన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ద్వారా వీలైనంత మేరకు ల్యాండ్ క్లియరెన్స్ ఇప్పించి, బలిజ భవన్‌కు కావాల్సిన నిధులు కూడా సేకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరూన్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ అహమ్మద్‌బాషా, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ సీఎం, మేయర్‌కు వినతి పత్రాలు సమర్పిస్తున్న బలిజ నాయకులు

రోబోటిక్ టెక్నాలజీతో మోకాళ్ల మార్పిడి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని విద్యాసాగర్ హాస్పిటల్‌లో రాయలసీమలో ప్రప్రథమంగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించి మోకాలు, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ సురేష్‌బాబు, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యాసాగర్ హాస్పిటల్ గత 15 సంవత్సరాలుగా జిల్లాతోపాటు కడప నగరవాసులకు మోకాలు, కీళ్ల సమస్యలకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తోందన్నారు. నిష్ణాతులైన వైద్య బృందానికి 5800 లకు పైగా మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు చేసిన అనుభవం ఉందన్నారు. ఇంపోర్టెడ్ మోకాలు పరికరాలు, లామినార్ ఎయిర్ ఫ్లో థియేటర్స్ , అత్యాధునిక సదుపాయాలతో 50 పడకల ఆర్థోపెడిక్ హాస్పిటల్‌తోపాటు అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని జతపరచడం ద్వారా 100 శాతం మెరుగైన ఫలితాలను పొందగలరని వివరించారు. అనంతరం డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ మోకాలు కీళ్ల మార్పిడికి సంబంధించి తాము విశేష సేవలు అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా కొన్ని వేల శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇప్పటివరకు కంప్యూటర్ నేవిగేషన్ పద్ధతి ద్వారా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తుండగా కాలంలో వచ్చిన మార్పులు, ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా ప్రస్తుతం రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించి మోకాలు కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ ద్వారా ఖచ్చితత్వాన్ని పాటిస్తూ రోగికి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తామని వివరించారు. ఈ ఆపరేషన్ ద్వారా తక్కువ నొప్పి, త్వరితగతిన కోలుకోవడం, అమరిక, అలైన్‌మెంట్, స్థిరత్వం ఖచ్చితత్వంగా ఉంటుందన్నారు. ఒకసారి మోకాలి శస్త్ర చికిత్స ద్వారా జీవితాంతం సమస్యలు రాకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నామన్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా గతంలో లాగానే జీవనం సాగించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. మోకాలు, కీళ్లకు సంబంధించి శస్త్ర చికిత్సలు అవసరమైన వారు తాము అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఇటీవల రోల్ ఆఫ్ రోబోటిక్ టెక్నాలజీ ఇన్ ఫ్యూచర్ అనే అంశంపై నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది, స్మిత్ నెఫ్రూ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


బహుమతులు గెలుపొందిన విద్యార్థులతో అతిథులు

నాడీ సంబంధిత వ్యాధులపై అవగాహన తప్పనిసరి

కడప కార్పొరేషన్ : నాడీ సంబంధిత వ్యాధులపై గ్రామీణ, మారుమూల గిరిజన ప్రాంతాలలో మరింత అవగాహన కల్పించేలా ట్విన్ డిస్ట్రిక్ట్ న్యూరో క్లబ్ సంస్థ కార్యక్రమాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యూరో వైద్యుల సంఘం (ఏపీ ఎన్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ సూచించారు. ఆదివారం నగరంలోని ద్వారకానగర్‌లో వైయస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన న్యూరో సర్జన్లు, న్యూరో ఫిజీషియన్లు సమావేశయ్యారు. ఈ సందర్భంగా ట్విన్ డిస్ట్రిక్ న్యూరో క్లబ్‌ను ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ విజయ మాట్లాడుతూ ప్రజలకు నరాల వ్యాధుల గురించి మరింత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్లలో ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సీట్ బెల్ట్, అలాగే ద్విచక్ర వాహనాలలో ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలను కొంతవరకైనా అరికట్టవచ్చని చెప్పారు. అనంతరం ఏపీ న్యూరో వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఐ.బాబ్జి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ వైయస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన న్యూరో వైద్యులంతా ఈ సంస్థ ద్వారా సంఘటితంగా ఉండాలని ఉద్బోధించారు. సంఘం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షుడు అవ్వారు అర్జున్ కుమార్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు నాడీ సంబంధిత వ్యాధుల పట్ల మరింత చైతన్యం పెంపొందించేలా సంఘం ద్వారా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్విన్ డిస్ట్రిక్ట్ న్యూరో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్. కమ్మినేని ఆంజనేయులు, జనరల్ సెక్రెటరీ డాక్టర్ డి. జగదీశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఆర్.జయచంద్రారెడ్డి, న్యూరో వైద్యులు డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ జి.గణేష్, డాక్టర్ కె.జగదీష్ బాబు, డాక్టర్ నవీన్ ప్రసాద్, డాక్టర్ జె. మోహన్ సిద్ధార్థ్, డాక్టర్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ట్విన్ డిస్ట్రిక్ట్ న్యూరో క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఏపీ ఎన్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షురాలు పి. విజయ

తండ్రి కళ్లెదుటే.. తనయుడి దుర్మరణం

- పొలం వద్ద స్టార్టర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్
- అక్కడికక్కడే సీఏ విద్యార్థి మృతి
- కె.రాజుపల్లెలో విషాదం


మురికినాటి చెన్నకేశవ రెడ్డి(ఫైల్)

చక్రాయపేట : మరో రెండు మూడు నెలల్లో సీఏ కోర్సు పూర్తవుతుంది. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పి నాలుగు రోజులు ఇంటివద్దే ఉండి ఆపై కాలేజీకి వెళ్లి పరీక్షలు రాసి ఇంటికి వస్తానని చెప్పేందుకు సొంతూరికి వచ్చాడు. ఇంటి వద్ద హాయిగా గడిపాడు. పొలంలో వేరుశనగ పంట వద్ద ఉన్న తన తండ్రికి భోజనం ఇచ్చి రావడానికి వెళ్లాడు. ఇక అటునుంచి అటే అనంత లోకాలకు వెళ్లాడు. తమ బిడ్డ తమకు అండగా ఉంటాడని కలలు గన్న వృద్ధ దంపతుల ఆశలను కరెంటు కాటేసింది. ఈ హృదయ విదారక సంఘటన చక్రాయపేట మండలం కె.రాజుపల్లెలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కె.రాజుపల్లెకు చెందిన మురికినాటి వాసుదేవరెడ్డి, లక్ష్మీదేవమ్మల కుమారుడు చెన్నకేశవరెడ్డి నెల్లూరు లోని ఓ ప్రైవేట్ కళాశాలలో సీఏ చివరి సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులు సెలవులు ఉన్నాయని ఇంటికి వచ్చాడు. మరో రెండు రోజుల్లో తాను కాలేజీకి వెళ్లాలని ఇంటిలో కూడా చెప్పాడు. అయితే ఆదివారం పొలానికి నీళ్ల కట్టేందుకు వెళ్లిన తండ్రికి భోజనం ఇచ్చి రావడానికి కారియర్ తీసుకొని బయలుదేరాడు. ద్విచక్రవాహనం ఎక్కే సమయంలో క్యారియర్ కింద పడిన విషయం గమనించిన తల్లి నీవు వెళ్లొద్దు తాను తీసుకొని వెళతానని వారించినా వినకుండా పొలంవద్దకు వెళ్లాడు. అక్కడ తండ్రికి క్యారియర్ ఇచ్చాడు. అంతలోనే తండ్రి వాసుదేవరెడ్డి కరెంటు వచ్చిందేమో స్టార్టర్ ఆన్ చేసి వెళ్లమని చెప్పడంతో అక్కడి నుండి మోటారు వద్దకు వెళ్లాడు. స్టార్టర్ వద్ద వైర్లు తెగిన విషయం గమనించక కాలు పెట్టగానే షాక్‌కు గురై పక్కనే ఉన్న వైర్ల మీద పడ్డాడు. దీంతో పక్కవైర్లు కూడా తెగి మీద పడటంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం గ్రామంలో తెలియగానే అందరూ అక్కడికి చేరుకొని కన్నీటి పర్యంతం అయ్యారు. జరిగిన సంఘటనపై చక్రాయపేట పోలీసులతో పాటు విద్యుశాఖ అధికారులకు సమాచారం అందించారు. మృతదేహానికి వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో శవ పరీక్షలు చేయించినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైఎస్ కొండారెడ్డి నివాళులు

విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన చెన్నకేశవ రెడ్డి మృతదేహానికి వేంపల్లె ప్రభుత్వ వైద్యశాల వద్ద చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి నివాళులు అర్పించారు. జరిగిన సంఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న మృతుడి తండ్రి వాసుదేవ రెడ్డిని ఓదార్చారు. ఆయన వెంట బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదరావు, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి. మండల యూత్ కన్వీనర్ రామాంజులరెడ్డి, జనార్దన్‌రెడ్డి, సురేష్ ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామంలో షేక్ అంగడి మహబూబ్ ప్యారి (40) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. షేక్ అంగడి మహబూబ్ ప్యారి శనివారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో బీపీ ఎక్కువ కావడంతో ఇంట్లో ఉన్న బీపీ మాత్రలు అధికంగా తీసుకుంది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది, ఆ సమయంలో భర్త పిల్లలు ఇంట్లో లేరు. అయితే ఆమె కూతురు ఇంట్లోకి వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న తల్లిని చూసి ఇరుగు పొరుగు వారితో కలిసి కడప రిమ్స్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి 8:30 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పార్థసారథి తెలిపారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ


గాయపడిన చిన్నబాబు

వీరపునాయునిపల్లె : ఎర్రగుంట్ల–వేంపల్లె ప్రధాన రహదారిలో సంగాలపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాల మధ్య ఆదివారం ఉదయం ద్విచక్రవాహనం, కారు ఢీ కొన్న ఘటనలో యువకునికి గాయాలయ్యాయి. వేంపల్లె పుల్లయ్య తోటకు చెందిన చిన్నబాబు ఎర్రగుంట్ల నుంచి అతని స్వగ్రామమైన వేంపల్లెకు వస్తుండగా గంగిరెడ్డిపల్లె, సంగాలపల్లె గ్రామాల మధ్య ద్విచక్రవాహనం లారీని క్రాస్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది ఈ ఘటనలో ద్విచక్రవాహనంలో వెళుతున్న వ్యక్తికి కాలు పూర్తిగా విరగడంతో పాటు గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. ఈ ప్రమాదానికి అతి వేగమే ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. ఈ ఘటనపై ఇంతవరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

దళితుని భూమిలో విధ్వంసం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని కంబాలకుంట గ్రామానికి చెందిన పందికాళ్ల నారాయణ అనే దళిత రైతు భూమిలో కొందరు విధ్వంసం సృష్టించారు. సింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన బోగాబత్తిన ఉమాశంకర్ రౌడీలతో దాడి చేసి కంచె, మామిడి చెట్లు పెరికి వేసినట్లు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సింగారెడ్డిపల్లి పంచాయతీలోని సర్వే నంబరు. 729/3లో 4.58 ఎకరాలు భూమి నారాయణ తండ్రి పేరుతో గత 20 సంవత్సరాలుగా వీరి అనుభవంలోనే ఉంది. నారాయణ తండ్రి మృతి చెందడంతో ఆ భూమిని నారాయణ పేరుతో ఆన్‌లైన్ చేయించుకున్నాడు. రెండు సంవత్సరాల క్రితం నుంచి భూమికి కంచె వేసుకున్నారు. మామిడి చెట్లు కూడా నాటారు. సింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉమా శంకర్ బయట ప్రాంతాల నుంచి 40 నుంచి 50 మంది రౌడీ ముకలను తీసుకొని రాతిపోళ్లను ధ్వంసం చేసి పూడ్చిన మామిడి చెట్లను పెరికివేశారు. నారాయణ, కుటుంబ సభ్యులు చూస్తుండగానే దాదాపు 50 మంది రౌడీముకలు కర్రలు, రాళ్లు చేతబట్టి భూమిలో నానా హంగామా చేశారు.

125 బీసీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న సురేష్ బాబు, అంజద్‌బాషా


మైనార్టీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరంలో 21, 19 డివిజన్లలో బీసీ వర్గానికి చెందిన 125 కుటుంబాల వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం పార్టీ కడప, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల రీజినల్ కోఆర్డినేటర్ సురేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాలు వాకి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 21వ డివిజన్ కార్పొరేటర్ సుజాత, డివిజన్ ఇన్‌చార్జి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో... భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు దివంగత కన్నా రక్తసంబంధీకులైన గణేష్, కార్తీక్, సాయిబాబా, వెంకటకృష్ణ, వెంకటేశ్వర్లు, నవీన్, జగదీష్ తదితర 50 కుటుంబాలకు చెందిన వారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే.. 19వ డివిజన్ కార్పొరేటర్ శిరీషా, లక్ష్మయ్య ఆధ్వర్యంలో.. పూసర్ల సామాజిక వర్గానికి చెందిన తన్నీరు సురేంద్ర, రమణ వారి బంధువర్గానికి చెందిన 75 కుటుంబాలు వైసీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరుకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, హరూన్ గ్రూప్స్ ఎండీ అహ్మద్ బాషా, పి.జయచంద్రారెడ్డి, నాయకులు ఎన్.సుబ్బారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎంవీఆర్ ప్రసాద్ రెడ్డి, తోటక్రిష్ణ, జిలానీ, రామ లక్ష్మణ్ రెడ్డి, శ్రీరంజన్ రెడ్డి, శ్యాంసన్ పాల్గొన్నారు.

టీడీపీని వదిలి వైఎస్ఆర్‌సీపీలో చేరిక

ప్రొద్దుటూరు క్రైం : సమర్థవంతమైన నాయకత్వం వైపే జనం ఉంటారని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి తెలిపారు. 14వ వార్డులోని టీడీపీకి చెందిన 250 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆదివారం శ్రీనివాసనగర్‌లో జరిగిన సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అనుచరులైన ఓతూరి అహ్మద్‌బాషా, మస్తాన్, కరీముల్లా, సాధిక్‌వలితో పాటు సుమారు 250 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరగా, వైస్ చైర్మన్‌తో పాటు నాయకులు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బంగారుమునిరెడ్డి మాట్లాడుతూ గత రెండు ఎన్నికల్లోనూ 14వ వార్డు ప్రజలు వైఎస్సార్‌సీపీకి భారీ మెజారిటీ ఇచ్చారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రొద్దుటూరులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి మైనార్టీలంటే ఎనలేని అభిమానమన్నారు. ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల పట్ల అత్యంత అభిమానం చూపుతూ వారికి అనేక ఉన్నత పదవులను ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కూడా మైనార్టీలకు 9 కౌన్సిలర్ పదవులు, రెండు కో ఆప్షన్ పదవులు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, 14వ వార్డు కౌన్సిలర్ జిలాన్, కామిశెట్టిబాబు, వరికూటి ఓబుళరెడ్డి, కాకర్ల నాగేషారెడ్డి, ఇతర నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జెడ్పీ ఆవరణంలో డీసీఈబీకి 10 సెంట్లు కేటాయించడం హర్షణీయం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని జిల్లా పరిషత్తు ఆవరణంలో డీసీఈబీ(డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) భవన నిర్మాణం కోసం 10 సెంట్లు స్థలాన్ని కేటాయించి ఉత్తర్వులు వచ్చేందుకు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సహకరించడం హర్షణీయమని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం జెడ్పీ చైర్మన్‌ను రాజంపేటలోని తమ ఎస్టేట్‌లో కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ డీసీఈబీ నిర్మాణం కోసం జెడ్పీ ఆవరణంలో స్థలం కావాలని అడిగిన వెంటనే స్థలాన్ని కేటాయించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య, ఎస్ఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ఆపూస్మ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి, ఆపూస్మ జిల్లా అధ్యక్షుడు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ చైర్మన్ అమరనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఆపూస్మా నాయకులు